## ఘనంగా ఏపీ సీఎం జన్మదిన వేడుకలు


ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అభిమానులు


స్వీట్లు పంపిణీ చేస్తున్న ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులు


గణేశ్‌నగర్‌లో దేశిరెడ్డి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

**నిజాంపేట్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ప్రగతినగర్‌లో గురువారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వివిధ పార్టీల నాయకులు,కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జగన్ మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన చేస్తూ పేద, మధ్య తరగతి జీవితాల్లో వెలుగు నింపుతున్నారని అన్నారు. ఏపీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రగతిపథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రగతినగర్ ఏనుగు బొమ్మల సెంటర్‌లో ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు.

### గణేశ్‌నగర్‌లో...

**కుత్బుల్లాపూర్:** గణేశ్‌నగర్‌లో దేశిరెడ్డి సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి అభిమానులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 23న గీతా జయంతి

**చింతల్:** గీతా జయంతి పండుగను ఘనంగా నిర్వహించనున్నట్లు భగత్ సింగ్‌నగర్ ధర్మశాస్త్ర సేవా సమితి అధ్యక్షుడు ఛునేటి రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గీతా జయంతి అనగా భగవద్గీతను బోధించిన రోజు అని పేర్కొన్నారు. డిసెంబర్ 23 ఉదయం 8గంటలకు శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలతో పాటు 108 మందితో భగవద్గీత పారాయణం ఉంటుందన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. హిందూ బంధువులందరూ పెద్ద ఎత్తున పాల్గొని గీతా జయంతిని జయప్రదం చేయాలని కోరారు. ఆసక్తి గల వారు ఈ నెల 21 లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం చింతల్ డివిజన్ లోని భగత్‌సింగ్‌నగర్ శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం హరిహర క్షేత్రంలో కార్యక్రమం జరుగుతుందని, ఇతర వివరాలకు శ్రీ ధర్మశాస్త్ర సేవా సమితి 9059663440, 9949236133 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## పాఠశాల భవనం... వ్యర్థాల డంపింగ్‌కు కేంద్రం




గురుమూర్తినగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద భవన నిర్మాణాల డంప్

**రంగారెడ్డినగర్:** పాఠశాల భవనం వద్ద నిర్మాణ వ్యర్థాలు, పాత వస్తు సామగ్రిని డంప్ చేయడంతో విద్యార్థుల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గురుమూర్తినగర్ ప్రభుత్వ పాఠశాల భవనం వ్యర్థాల డంపింగ్‌కు కేంద్రంగా మారింది. చుట్టుపక్కల ఇళ్ల వాసులు ఇష్టానుసారంగా పాఠశాలకు ఇరువైపులా గోడలను ఆనుకుని డెబ్రిస్, పాత ఇనుప గేట్లు, చెత్తాచెదారాలను వేస్తున్నారు. దీంతో తరగతి గదుల కిటికీలను తెరవలేని పరిస్థితి నెలకొంది.

◆ ఈ విషయమై ఎవరైనా ప్రశ్నిస్తే సదరు వ్యక్తులు బెదిరింపులకు దిగుతున్నారన్న పలువురు పేర్కొంటున్నారు. అంతే కాకుండా పాఠశాలను ఆనుకునే వాహనాలను నిలుపుతున్నారు. పాఠశాల చుట్టు పక్కల ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే పిల్లలు చదువులపై శ్రద్ధ చూపడంతో పాటు వారు ఆరోగ్యంగా ఉంటారన్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వ్యర్థాలు డంప్ చేయకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ప్రతిరోజు ఫుట్‌బోర్డే..!

- నిండుగా వస్తున్న బస్సులు
- ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్న విద్యార్థులు
- బస్సు సర్వీసులు పెంచాలని వినతి


ఓ సిగ్నల్ వద్ద బస్సు ఆగడంతో కాసేపు ఫుట్‌బోర్డు నుంచి కిందకు దిగిన విద్యార్థులు

**జీడిమెట్ల:** ఆర్టీసీ బస్సుల్లో కళాశాల విద్యార్థులు ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. కళాశాలకు వెళ్లే సమయంలో ఉన్న బస్సులు సరిపోకపోవడంతో వారు డేంజర్ ప్రయాణం చేయాల్సి వస్తుంది. ప్రతినిత్యం విద్యార్థులు సూరారం, షాపూర్‌నగర్ నుంచి నగరంలోని వివిధ కళాశాలలకు వెళ్తుంటారు. ఉదయం పూట బస్సులో కనీసం నిల్చోవడానికి సైతం వీలులేకపోవడంతో ఫుట్‌బోర్డుపై నిల్చుని ప్రయాణం చేస్తున్నారు. ఇక పట్టు జారితే అంతే సంగతులు అన్నట్లుగా వారి ప్రయాణం కొనసాగుతుంది. చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం కనీస ప్రయాణ సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని విద్యార్థులు వారి అభిప్రాయాలను తెలియజేస్తున్నారు.

### బస్సుల సంఖ్య పెంచాలని అభ్యర్థన..

ఉదయం గండిమైసమ్మ నుంచి చింతల్ వరకు బస్సుల సంఖ్యను పెంచితే బాగుంటుందని విద్యార్థులు అంటున్నారు. ప్రతినిత్యం కళాశాలకు వెళ్లాలంటే బస్సులను పట్టుకుని సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు గాని అధికారులు కాని పట్టించుకుని ఉదయం బస్సు సర్వీసుల సంఖ్యను పెంచాలని విద్యార్థులు కోరుతున్నారు. కార్పొరేట్ కళాశాలలన్నీ ఐడీపీఎల్‌లో ఒకే చోట ఉండటం, కళాశాల టైమింగ్స్ సైతం ఒకేలా ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలపుతున్నారు.



### ఫుట్‌బోర్డు చేయాల్సి వస్తోంది..

నేను ప్రతిరోజు కళాశాల వెళ్లేందుకు చింతల్ నుంచి ఐడీపీఎల్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తాను. ప్రతిరోజు గండిమైసమ్మ నుంచి వచ్చే బస్సులు ప్రయాణికులతో నిండి వస్తున్నాయి. షాపూర్ వచ్చేసరికి అసలు బస్సుల్లో జాగా లేకపోవడంతో ఫుట్‌బోర్డుపై నిల్చుని ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఇప్పటికైనా ఉదయం సాయంత్రం వేళల్లో బస్సుల సంఖ్యను పెంచితే బాగుంటుంది.

– సాయితేజ (ఇంటర్ విద్యార్థి)

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


అనీల్ పాండే (ఫైల్)

**సుభాష్‌నగర్:** ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన అనిల్ పాండే(26) కుటుంబం సూరారం కాలనీ ఎంబీ గ్రామర్ హైస్కూల్ సమీపంలో అద్దెకు ఉంటోంది. కాగా బుధవారం అర్ధరాత్రి అనిల్‌పాండే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సూరారం పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. కాగా యువకుడి మృతికి గల కారణాలు తెలియరాలేదు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు శ్రీనివాసరావు

**కుత్బుల్లాపూర్:** ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వచ్చిన టాటా ఏసీ వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లి లక్ష్మీనగర్‌కు చెందిన శ్రీనివాసరావు (37) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి 11.30గంటలకు డ్యూటీ ముగించుకుని కొంపల్లి మీదుగా గుండ్లపోచమ్మపల్లికి (ఏపీ 16 ఈఎం 0630) బైక్‌పై వస్తున్న శ్రీనివాస్‌రావును గుండ్లపోచంపల్లి పార్క్‌వుడ్ విల్లాస్ సమీపంలో ఎదురుగా వచ్చిన టాటా ఏసీ (టీఎస్ 08 యూఎల్ 0455) ఢీకొట్టింది.ఈప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన మేడ్చల్‌కు చెందిన డ్రైవర్ అజీందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

## సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలి


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు సమస్యలను వివరిస్తున్న కాలనీల వాసులు

**కుత్బుల్లాపూర్:** సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు స్థానికంగా నెలకొన్న భూగర్భడ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన తప్పకుండా ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## జగద్గిరిగుట్ట బస్టాప్.. నిత్యం ట్రాఫిక్‌జామ్


అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు

**జగద్గిరిగుట్ట:** అనుకున్నది ఒక్కటి.. అయినది ఒక్కటి అన్న చందంగా మారింది. జగద్గిరిగుట్ట బస్టాప్ ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. అసలే ఇరుకైన గల్లీలు ఉండటం ట్రాఫిక్ కష్టాలు మరింత ఎక్కువయ్యాయి. విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు నిత్యం ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఇటీవల అధికారులు డివైడర్లను ఏర్పాటు చేశారు. అయినా సమస్యకు పరిష్కారం లభించలేదు. ఈ సమస్యపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## సత్తాచాటిన కృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్ విద్యార్థులు



ఉత్తమ ర్యాంకులు సాధించిన కేటీఎస్ విద్యార్థులు

**రంగారెడ్డినగర్:** సెమ్స్ ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో నందానగర్ కృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అవార్డ్స్, ప్రైజ్‌మనీ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెమ్స్ ఒలింపియాడ్ కన్వీనర్ అరుకాల రామశ్చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఎస్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించడం ఉపాధ్యాయుల గొప్పదనం అని టీచర్స్‌ను కొనియాడారు. రాష్ట్రంలోని 400 పాఠశాలల్లో కేటీఎస్ ఒకటిగా నిలవడం పట్ల పాఠశాల ఎక్సలెన్స్ అవార్డును అందజేశారు. ఈ సంవత్సరం నిర్వహించే పరీక్షల్లో విద్యార్థులు మరిన్ని ఉత్తమ ర్యాంకులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

◆ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిలుకూరి మహేందర్‌రెడ్డిని ఒలంపియాడ్స్ వారు అచార్యదేవోభవ అవార్డుతో సన్మానించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ కేపీ విశాల్ అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్ఆర్ బాషా, ఒలింపియాడ్ పరీక్ష ఇన్‌చార్జ్ రమ్యశ్రీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో సెమీ క్రిస్మస్ సంబురాలు



**కుత్బుల్లాపూర్:** సెయింట్ ఆంథోనీ హైస్కూల్ కొంపల్లి, సుచిత్ర శాఖల్లో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రేవరెండ్ డేవిడ్ రాజు ముఖ్యఅతిథిగా హాజరై క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన క్రీస్తు జననం నాటిక ప్రదర్శన, నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సుందర రాజు, అకాడమీ డైరెక్టర్ సరితా, కొంపల్లి ప్రిన్సిపాల్ షర్మిళ క్రిస్టీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిగ్నియా బెస్ట్ సౌండ్ సెంటర్ ప్రారంభం



**కుత్బుల్లాపూర్:** డబ్ల్యూఎస్ ఆడియాలజీ గ్రూప్‌లోని అతిపెద్ద బ్రాండ్ అగ్రగామిగా ఉన్న సిగ్నియా సంస్థ తన 350వ బెస్ట్ సౌండ్ సెంటర్‌ను గురువారం సుచిత్ర సర్కిల్‌లో ప్రారంభించిది. ముఖ్యఅతిథులుగా హాజరైన ఆడియాలజీ ఇండియా సీఈవో అవినాష్ పవార్ మాట్లాడుతూ.. సిగ్నియా ప్రోడక్స్ అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఎక్విమెంట్ అని, అన్ని వయస్సుల వారికి ఈ సిగ్నియా ప్రోడక్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. హైసౌండ్స్‌ని కంట్రోల్ చేస్తు ఆడియో స్పష్టంగా వినిపించేలా ప్రోడక్స్‌ను రూపొందించామన్నారు. హైదరాబాద్ వంటి పట్టణ ప్రాంతాలు జీవనశైలి, పర్యావరణ కారణాల వల్ల వినికిడి సమస్యలు పెరిగాయని, సిగ్నియా తాజా బెస్ట్‌సౌండ్ సెంటర్‌ను ప్రారంభించడం ద్వారా వినికిడి లోపం వల్ల ప్రభావితమైన వారికి అత్యధిక వినికిడి సంరక్షణ పరిష్కారాలను అందించనున్నామని తెలిపారు. హియర్‌నెస్ హియరింగ్ క్లినిక్‌లో చీఫ్ ఆడియోలజిస్ట్ ఎస్.కౌశిక్ ప్రభు తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

## ముగిసిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలు

**నిజాంపేట్:** బాచుపల్లిలోని వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాలలో 36గంటల పాటు నిర్విరామంగా సాగిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2023 సాఫ్ట్‌వేర్ ఎడిషన్ గ్రాండ్ ఫినాలే ముగిసింది. ఈ కార్యక్రమంలో ఏఐసీటీఈ నోడల్ సెంటర్ హెడ్ యోగేశ్ వాద్వానీ, నోడల్ సెంటర్ సమన్వయకర్త శివ సిరిపోలు, నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా, సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు పాల్గొన్నారు. మొత్తం 150 మంది విద్యార్థులు 25 జట్లుగా హ్యాకథాన్‌లో పాల్గొన్నాయి. విజేతగా నిలిచిన ఒక్కో జట్టుకు రూ. లక్ష చొప్పున నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. సీడీ నాయుడు, సంచాలకులు చెన్నకేశవరావు, నోడల్ సెంటర్ ఇన్‌చార్జ్ డా. కౌసర్ నిఖత్ తదితరులు పాల్గొన్నారు.

## నడుస్తున్న కారులో మంటలు



**నిజాంపేట్:** కారు బ్యాటరీ పేలడంతో మంటలు చెలరేగి కారు దగ్ధమైన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. వివరాల్లోకి వెళితే.. గురువారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ప్రగతినగర్‌లోని జగన్‌స్టూడియో సమీపంలో అటుగా వెళ్తున్న కారు బ్యాటరీ ఒక్కసారిగా పేలింది. దీంతో కారు ముందు భాగంలో మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన స్థానికంగా ఉండే వ్యక్తులు మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా కారు నడుపుతున్న వారి వివరాలు తెలియరాలేదు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

**నిజాంపేట్:** బాచుపల్లిలోని వికాస్ కాన్సెప్ట్ స్కూల్‌ను ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలయ్యింది. గురువారం పాఠశాలలో ఆనందత్సోవాలను ఘనంగా నిర్వహించారు. చైర్మన్ స్వరాజ్యలక్ష్మి, డైరెక్టర్లు అనీతచౌదరి, పద్మ, చరితా చౌదరి, నందరకుమార్ చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దుర్గాకుమార్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీవేణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువు స్థలాలను కాజేస్తున్నారు..


పీర్జాదిగూడ పెద్దచెరువులో మట్టితో నింపి చదును చేస్తూ..


ఉప్పల్ నల్ల చెరువును మట్టితో పూడుస్తూ..

- రోజుకు కొంత మట్టితో నింపి స్థలం కబ్జా
- బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ స్థలాలను కలుపుకొని..
- యథేచ్ఛగా కొనసాగుతున్న ఆక్రమణల పర్వం
- ఎన్నికల సమయంలో పట్టించుకోని అధికారులు
- నగర శివారుల్లో పలుచోట్ల అక్రమ నిర్మాణాలు
- అధికారుల నిర్లక్ష్య వైఖరిపై జనం ఆగ్రహం

**సాక్షి, మేడ్చల్ జిల్లా:** నగర శివారులో పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలు అర్బన్, సెమీ అర్బన్ పట్టణాలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలుగా వేగంగా విస్తరిస్తుండటంతో అక్రమార్కుల కళ్లు చెరువులపై పడ్డాయి. వీటిని ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారు. రాజకీయ పలుకుడి ఉన్న వారైతే ఏకంగా చెరువులు, కుంటల సమీపంలో ఎకరం లేదా అరెకరం పట్టా భూమిని కొనుగోలు చేసి, పక్కనున్న బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ స్థలాన్ని కలుపుకొని అపార్టుమెంట్లు, ప్రైవేట్ విద్యా సంస్థలు, ఆస్పత్రులను నిర్మిస్తున్నారు. పట్టణాల్లో ఇప్పటికే సగానికిపైగా చెరువులు, కుంటలు అన్యాక్రాంతం అయ్యాయి. వీటిని పరిరక్షించాల్సిన నీటిపారుదల, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో చెరువులు కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది.

### చెరువుల పరిరక్షణ కమిటీలు ఉన్నా..

చెరువులు, కుంటలను కబ్జాదారుల నుంచి కాపాడేందుకు ప్రతి జిల్లాలో చెరువుల పరిరక్షణ కమిటీ వేసి పరిరక్షించాలని గతంలో హైకోర్టు పేర్కొంది. అందు కోసం కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించింది. ఆ కమిటీలో పోలీసు అధికారులకు స్థానం కల్పించాలని ఆదేశించింది. కానీ మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో చెరువుల పరిరక్షణ కమిటీలు ఉన్నా.. నామమాత్రంగానే పని చేస్తున్నాయి. పంచాయతీలు, పట్టణాల్లో ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలను ఇప్పటికీ ఈ కమిటీలు పూర్తిస్థాయిలో గుర్తించలేదు. కొన్నిచోట్ల గుర్తించినా ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లతో వాటిని తొలగించడం లేదు.

### చెరువుల సరిహద్దులు గుర్తించినా..

శివారు జిల్లాలో ఏడు నగర పాలక సంస్థలు, 21 మున్సిపాలిటీలతో సహా గ్రామ పంచాయతీల పరిధిలో 552 చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులో 476 చెరువులు, కుంటలు, నాలాల సరిహద్దులు గుర్తించే ప్రక్రియలో భాగంగా మూడు శాఖలు సంయుక్తంగా జీపీఎస్ విధానంలో శాటిలైట్ సర్వే నిర్వహించి, సంబంధిత వివరాలను హెచ్ఎండీఏకు నివేదించింది.

### మచ్చుకు కొన్ని..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో రా, చింతల చెరువుల్లోని బఫర్ జోన్లలో బహుళ అంతస్తుల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా.. పట్టించుకునే వారే లేరు. అల్వాల్ మండలం యాప్రాల్లో బడాయికుంటను ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. రాంపల్లిలోని ఎర్రమల్లె వాగును ఆనుకుని ఉన్న ఎకరన్నర బఫర్ జోన్ స్థలాన్ని లేఅవుట్ చేసినా నీటి పారుదల శాఖకిమ్మనడం లేదు. ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్‌లో రెండు నాలాలను ఆక్రమించి వెంచర్ చేసినా పట్టించుకోవడం లేదు. పీర్జాదిగూడలో పెద్దచెరువు, ఉప్పల్‌లో నల్లచెరువు భూములు కూడా ఆక్రమణకు గురయ్యాయి. ఇదే పరిస్థితి దమ్మాయిగూడ, జవహర్‌నగర్, నాగారం, పీర్జాదిగూడ, ఘట్‌కేసర్, మేడ్చల్, దుండిగల్, కొంపెల్లి, గుండ్లపోచంపల్లి పురపాలక సంఘాలతో సహా సెమీ అర్బన్లుగా మారుతున్న గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పలు చెరువులు, కుంటలు కబ్జాకు గురవుతున్నాయి.

## పనులు చేపట్టకపోతే.. కబ్జా చేసేస్తరు!

**జగద్గిరిగుట్ట:** డివిజన్ పరిదిలోని భూదేవి హిల్స్ సమీపంలోని బతుకమ్మకుంట అభివృద్ధికి రూ.25లక్షలు మంజూరు అయ్యాయి. ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే వివేకానంద్ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. కాని ఇప్పటి వరకు ప్రారంభించలేదు. ఇప్పటికే ఈ స్థలం చుట్టూ కబ్జా అవుతూ వస్తున్నాయి. వీలైనంత తొందరగా ఈ పనులు పూర్తి చేయకపోతే స్థలం కబ్జా అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ విషయమై గాజులరామారం ఏఈ తిరుపతిని వివరణ కోరగా వచ్చే వారంలో ఈ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.


భూదేవి హిల్స్ సమీపంలోని బతుకమ్మకుంట